క్లుప్తంగా

భీమలింగేశ్వర స్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో భీమలింగేశ్వర స్వామి

రాజుపాళెం : శ్రావణ మాసంలో మూడవ సోమవారం సందర్భంగా మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలోని భీమలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసినట్లు అర్చకులు వెంకటా చలపతి తెలిపారు. స్వామికి తెల్లవారుజామునుంచే బిందెసేవ, అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులు భీమలింగేశ్వర స్వామితో పాటు వినాయకుడు, పార్వతీదేవి, వీరభద్ర, నరసింహ స్వాములకు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా ఆరాధన మహోత్సవం



రథోత్సవంలో రాఘవేంద్రస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటలోని శ్రీరాఘవేంద్ర స్వామి ఆలయంలో స్వామివారి 354వ ఆరాధన మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం వేకువజామున గ్రామ ప్రదక్షిణం, రాఘవేంద్ర స్వామి బృందావనానికి పంచామృతాభిషేకం, వెండి కవచాలతో, గజమాలలు, తులసీమాలలతో అలంకరించారు. కడపకు చెందిన సమీరణా ఆచార్, విద్యానిధి ఆచార్, యాదగిరికి చెందిన నరసింహ ఆచార్, బళ్లారికి చెందిన సత్యసంకల్ప ఆచార్‌లు రాఘవేంద్రస్వామి జీవిత విశేషాలను, మహిమలను, గొప్పతనాన్ని వివరించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి రథోత్సవం నిర్వహించారు. రాత్రి పల్లకీ సేవ, మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం జరిగింది.

విద్యార్థులకు అతిథి భోజనం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న రామతులసి

కాశినాయన : మండలంలోని మూలపల్లె ఎంపీపీ పాఠశాలలోని 28 మంది విద్యార్థులకు మంగళవారం వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామతులసి తన పుట్టినరోజు సందర్భంగా అతిథి భోజనం ఏర్పాటు చేశారు. విద్యార్థుల మధ్యాహ్నం పుట్టిన రోజు వేడుకలను నిర్వహించుకోవడం చాలా ఆనందంగా ఉందని రామతులసి తెలిపారు.


పారిశుధ్య మెరుగుకు చర్యలు



మడూరు కాలువలో పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న కమిషనర్ రవిచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో ఆయన పర్యటించారు. బాలాజీనగర్‌లో ప్రజల ఫిర్యాదు మేరకు కమిషనర్ అక్కడ పర్యటించి చెత్తపాయింట్‌ను పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. అర్చన హాల్ వద్ద మడూరు కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని, రోటరీ కంటి ఆస్పత్రి వద్ద నీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ శాఖ అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ డి.కొండయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్ బాషా పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



విద్యార్థినికి మాత్రను మింగిస్తున్న జీసీడీఓ రూత్

కాశినాయన : ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని జీసీడీఓ రూత్ తెలిపారు. మండలంలోని వరికుంట్ల కస్తూర్బా గాంధీ పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ పాఠశాలలో మంచి వసతి, మెనూతో కూడిన భోజనం అందిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పి.మెర్సీరాణి, పీహెచ్‌ఎన్ శారద, ఏఎన్‌ఎం పద్మ, ఆశ కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

వరద ఉధృతి



రాజుపాళెం మండలంలోని వెల్లాల పాత వంతెనపై పారుతున్న నీరు

రాజుపాళెం : పైతట్టు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని రాజోలి ఆనకట్టకు నీరు భారీగా వస్తోంది. దీంతో రాజోలి ఆనకట్ట నీటితో జలకళ సంతరించుకుంది. సోమవారం వరదనీరు ఎక్కువగా రావడంతో వెల్లాల సమీపంలోని పాతవంతెనపై నీరు పారుతోంది. ప్రస్తుతం రాజోలి ఆనకట్ట నుంచి కుందూనదిలోకి 26700 క్యూసెక్కులు, ప్రధాన కాలువకు 200, కేసీ చాపాడు కాలువకు 50 క్యూసెక్కులు నీరు పోతున్నట్లు కేసీ కెనాల్ అధికారులు తెలిపారు.

కుందూనది వద్దకు వెళ్లవద్దు..

కుందూలో వరద నీరు ఎక్కువగా పారుతోందని, ఏఒక్కరూ కూడా అక్కడకు వెళ్లవద్దని ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర రెడ్డి తెలిపారు. రైతులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీఆర్‌ఓలకు నది వద్దకు ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని చెప్పామన్నారు. వెల్లాల పాత వంతెనపై నీరు పారుతుండటంతో కంప అడ్డంగా వేశామని తెలిపారు.

డ్రోన్ స్ప్రేయర్లతో రైతుకు లాభదాయకం



డ్రోన్ స్ప్రేయర్ వినియోగంపై వివరిస్తున్న సిబ్బంది, చిత్రంలో ఎమ్మెల్యే వరద, వ్యవసాయ అధికారి

ప్రొద్దుటూరు రూరల్ : ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ద్వారా అందించే డ్రోన్ స్ప్రేయర్లు ఎంతో ఉపయోగకరమని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. మండలంలోని చెన్నమరాజుపల్లె గ్రామంలోని ఆంజనేయ రైతు మిత్ర సంఘం సభ్యులకు మంగళవారం సబ్సిడీ ద్వారా డ్రోన్‌స్ప్రేయర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ వినియోగించడం వల్ల తక్కువ మందు వాడకం, తక్కువ నీటి ఖర్చుతో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణం స్ప్రే చేయవచ్చన్నారు. డ్రోన్ ఖరీదు రూ.10లక్షలు కాగా అందులో 80 శాతం సబ్సిడీ ద్వారా రూ.8లక్షలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతుల వాటా కింద రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు సంఘంగా ఏర్పడి సంబంధిత మండల వ్యవసాయశాఖ అధికారిని కలిసి దరఖాస్తు చేసుకుంటే సబ్సిడీ డ్రోన్ స్ప్రేయర్లను మంజూరు చేస్తామన్నారు. రైతులు రసాయనిక ఎరువులు ఎక్కువగా వినియోగించడం వల్ల భూసారం దెబ్బతింటుందన్నారు. పరిమితంగా ఎరువులను వాడి సాగు ఖర్చులను తగ్గించుకుని ఆదాయం పెంచుకోవాలన్నారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించి ఆర్థికంగా ఎదగాలన్నారు. అనంతరం డ్రోన్ స్ప్రేయర్‌తో ట్రైల్ నిర్వహించి రైతులకు చూపించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ అనిత, ఏఓ వరహరికుమార్, లింగాపురం ఏజీఆర్ బ్యాంక్ చైర్మన్ సిద్దారెడ్డి , నాగమునిరెడ్డి, సర్పంచ్ రాజువారి ఆదిలక్షుమ్మ, గ్రామ నాయకులు రాజువారి వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులను దారిమళ్లించకూడదు



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులతో ఏపీ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లయ్య

ప్రొద్దుటూరు : ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులను ప్రభుత్వం దారి మళ్లించకుండా వారి అభివృద్ధికే ఖర్చు చేయాలని ఏపీ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లె ఎల్లయ్య తెలిపారు. ప్రొద్దుటూరులో మంగళవారం ఏపీ దళిత సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏపీ దళిత సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శిగా తోట ఓబులేసు, ప్రొద్దుటూరు మండల కన్వీనర్‌గా పల్లవోలు సుమన్, దళిత బహుజన సమాఖ్య కన్వీనర్‌గా సుర శివశంకర్, జమ్మలమడుగు మండల కన్వీనర్‌గా దిబ్బగాళ్ల సుదర్శన్‌లను ఎన్నుకున్నారు. కొత్తపల్లె ఎల్లయ్య మాట్లాడుతూ ఏపీ దళిత సమాఖ్య వ్యవస్థాపకులు కొమ్ముపాలెం శ్రీనివాస్ పిలుపు మేరకు సమాఖ్యను బలోపేతం చేయాలన్నారు. 2024 మార్చి నుంచి 2025 మార్చి వరకు ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన నిధులను ఖర్చు చేయకుండా ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమతోపాటు ఇతర పరిశ్రమలను ఏర్పాటు చేసి అభివృద్ధికి తోడ్పడాలన్నారు.

పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్



ధర్నా నిర్వహిస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

మైదుకూరు : ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని మైదుకూరు ఆర్టీసీ డిపోకు చెందిన నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు రెండు రోజుల ఆందోళనలో భాగంగా మంగళవారం డిపో ఎదుట అసోసియేషన్ నాయకులు, సభ్యులు ధర్నా నిర్వహించారు. వేతన సవరణ అయిపోయి ఇప్పటికే రెండేళ్లు పూర్తయినందున వెంటనే ఐఆర్‌ను ప్రకటించాలని కోరారు. గవర్నర్‌పేట-2 డిపోకు చెందిన 4.15 ఎకరాల స్థలాన్ని లూలు సంస్థకు బదలాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీఓను ఉపసంహరించుకోవాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ డిపోను తరలించడం ఆపాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను చెల్లించాలని కోరారు. రిడైర్డ్ అయిన ఉద్యోగులకు గ్రాట్యూటీ, టెర్మినల్ ఎన్‌క్యాషమెంట్ తదితర చెల్లింపులను వెంటనే చేయాలని తెలిపారు. ఈహెచ్‌ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ డిపో అధ్యక్షుడు ఎస్.నాగరాజు, గ్యారేజీ కార్యదర్శి వైఎస్ రాయుడు, కోశాధికారి ఎస్ఎస్ రాయుడు, ఎం.వెంకటేశ్వర్లు, పురుషోత్తం, జీసీఎం రెడ్డి, ఎంవీ అప్పారావు, బీఎం రావు, బీవీ నారాయణ, ఎస్ఎం అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



గ్యారేజీ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

బద్వేలు అర్బన్ : ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వపరంగా, సంస్థ పరంగా ఉన్న న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ బద్వేలు తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు టి.నరసింహారెడ్డి, శివరామిరెడ్డి పేర్కొన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గ్యారేజీ గేటు ఎదుట నిర్వహించిన ధర్నాలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడారు. తక్షణమే పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు వేతనాల సవరణ ముగిసి రెండు సంవత్సరాలు కావస్తున్న నేపథ్యంలో ఐఆర్ ప్రకటించాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే చెల్లించాలని కోరారు. గవర్నర్‌పేట-2 డిపోకు చెందిన 4.15 ఎకరాల స్థలాన్ని లులూ సంస్థకు బదలాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ డిపో తరలింపును ఆపాలని కోరారు. సంస్థలో ఖాళీగా ఉన్న 8 వేల పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయడంతో పాటు పదోన్నతులు వెంటనే కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ బద్వేలు డిపో ప్రెసిడెంట్ చిన్నపరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జనార్దన్‌రావు, డిపో, గ్యారేజీ సెక్రటరీలు చంద్రయ్య, నాగేంద్ర, జాయింట్ సెక్రటరీ శ్రీధర్, డిపో నాయకులు ఎం.ఎస్.రాయుడు, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, బ్రహ్మానందరెడ్డి, కె.ఆర్.ఎస్.రెడ్డి, కె.వి.సుబ్బారావు, భాస్కర్, హుస్సేన్, అబ్రహాం, నరసింహులు, ప్రసాద్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ, ఇది బ్లాక్ డే



నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల : రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని, ఈ రోజు బ్లాక్ డేగా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల్లో పోలీసులు, టీడీపీ నేతలు కుమ్మక్కై నిట్టనిలువునా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని, డీఐజీ కోయ ప్రవీణ్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం అత్యంత దారుణమన్నారు. ఎంపీ అవినాష్‌రెడ్డితో పాటు అనేక మంది వైఎస్సార్‌సీపీ నాయకులను అరెస్టు చేయడం, వైఎస్సార్‌సీపీకి బలమున్న నల్లపరెడ్డిపల్లె, నల్లగొండపల్లె, ఎర్రబల్లె గ్రామాలను బూతుకు నాలుగు కిలోమీటర్ల దూరానికి మార్చడం ద్వారా టీడీపీ వర్గీయులు వైఎస్సార్‌సీపీ ఓటర్లను అడ్డుకున్నారన్నారు. జమ్మలమడుగు, కమలాపురం, ప్రొద్దుటూరు, కడప నియోజకవర్గాల నుంచి వేలాది మంది తెలుగుదేశం గూండాలను దించి స్థానిక ఓటర్లను భయభ్రాంతులను చేసి, ఏజెంట్ ఫారాలు లాక్కొని, ఓటర్ స్లిప్పులు బలవంతంగా తీసుకొని, బయట నుండి వచ్చిన వారితో ఓట్లు వేయించారన్నారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి వందలాది మందిని వెంటబెట్టుకొని వచ్చి ఒంటిమిట్టలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను బూతుల నుంచి బయటకు లాగి కొట్టడం, రిగ్గింగ్ చేయడం ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకమున్నందున వైఎస్సార్‌సీపీపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయవద్దని, అరెస్టులు చేయవద్దని హైకోర్టు తెలిపిందన్నారు. మంగళవారం జరిగిన అన్ని సంఘటనలు కోర్టు దృష్టికి తీసుకెళతామని ఆయన తెలిపారు.

సామాజిక అవగాహన అవసరం



ఏఐఎస్‌ఎఫ్ జెండాను ఎగురవేస్తున్న సంఘం నాయకులు

మైదుకూరు : విద్యార్థులకు చదువుతోపాటు సామాజిక అవగాహన అవసరమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.శ్రీరాములు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ అన్నారు. మైదుకూరులో మంగళవారం సీపీఐ అనుబంధ విద్యార్థి సంస్థ ఏఐఎస్‌ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. పోతిరెడ్డి భాస్కర్ సంఘం జెండాను ఎగురవేయగా, శ్రీరాములు ఆవిర్భావ కేక్‌ను కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 1936 ఆగస్టు 12న ఏఐఎస్‌ఎఫ్ ఏర్పడిందన్నారు. స్వాతంత్య్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిందన్నారు. సాతంత్య్రం అనంతరం విద్యార్థుల సమస్యలపై పోరాడుతోందని పేర్కొన్నారు. నేటితరం విద్యార్థులు సామాజిక అవగాహనను పెంపొందించుకోవాలంటే ఏఐఎస్‌ఎఫ్‌లో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఎస్.శంకర్, జి.ప్రసాద్, టి.వరుణ్, ఎం.జోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పాలకమండలి నియామకానికి నోటిఫికేషన్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయ నూతన పాలకమండలి నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈఓ జె.వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 7వ తేదీ నుంచి 20 రోజులలోపు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు తమ వివరాలను కడప దేవాదాయశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ఆల్‌బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ



విద్యార్థినులకు ఆల్‌బెండజోల్ మాత్రలను తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య



ఆల్‌బెండజోల్ మాత్రలను తినిపిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీత

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆల్‌బెండజోల్ మాత్రలతో నులిపురుగులను నివారించవచ్చని మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, వైద్యాధికారిణి డాక్టర్ హిమబిందు తెలిపారు. స్థానిక వైవీఎస్ మున్సిపల్ గరల్స్ హైస్కూల్‌లో మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఆల్‌బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినులు చదువుపై ఏకాగ్రతను, నేర్చుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఆల్‌బెండజోల్ మాత్రలను నమిలి మింగడం వలన రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి మందగించడం, నీరసం, కడుపునొప్పి, వికారం, వాంతులు, బరువు తగ్గడం, జ్ఞాపక శక్తి లేకపోవడం వంటి వ్యాధులను నివారించవచ్చని వివరించారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శోభారాణి హ్యాండ్ వాష్ గురించి, సిర్డ్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి ఆల్‌బెండజోల్ మాత్రల ప్రయోజనాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలనతోనే ఆరోగ్యం

ప్రొద్దుటూరు రూరల్ : నులిపురుగులను నిర్మూలించడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ హనీఫ్ బాబు తెలిపారు. కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆల్‌బెండజోల్ 400 ఎంజీ మాత్రలను విద్యార్థులతో మింగించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, ఆప్తాలమిక్ ఆఫీసర్ రఘురామిరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు కృష్ణమ్మ, బీఏ వరప్రసాద్, చంద్రకళ, సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై జాగ్రత్త తీసుకోవాలి

ప్రొద్దుటూరు క్రైం : విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీత తెలిపారు. మంగళవారం స్థానిక రామేశ్వరంలోని ఎస్‌సీపీసీఎస్ మున్సిపల్ హైస్కూల్, బొల్లవరంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నులిపురుగుల నివారణ కోసం ఆల్‌బెండజోల్ మాత్రలను విద్యార్థులకు తినిపించారు. డాక్టర్ గీత మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న 1 నుంచి 19 ఏళ్లలోపు విద్యార్థులందరికి నులిపురుగులు రాకుండా ఆల్‌బెండజోల్ మాత్రలను మింగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ మౌనిక, డాక్టర్ హిమబిందు, ప్రధానోపాధ్యాయుడు సత్యబాబు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, శోభారాణి, సీఓ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

మైదుకూరు : దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని, యుక్త వయసులోనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కళాశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజనానికి ముందు ప్రతి ఒక్కరూ చేతులు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పీవీ కృష్ణారెడ్డి నులిపురుగుల వల్ల కలిగే నష్టాలను వివరించారు. వాటి నివారణ ప్రాముఖ్యతను తెలిపారు. అనంతరం కళాశాల విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల రెడ్ రిబ్బన్ కమిటీ కోఆర్డినేటర్ అయ్యవారు రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సుభాన్ బాషా పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజంతోనే అభివృద్ధి

బద్వేలు అర్బన్ : ఆరోగ్యవంతమైన సమాజంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఇందుకోసం భావిభారత పౌరులైన చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ జి.రాజేష్‌కుమార్, డాక్టర్ జె.వినయ్‌కుమార్ పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల, తిరువెంగళాపురం ఉన్నత పాఠశాలలలో విద్యార్థులకు నులిపురుగు నివారణ మందులు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌమ్య, ఎంఈఓ ప్రమీల, సబ్ యూనిట్ అధికారి టి.నరసింహారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ అసిస్టెంట్ జనార్దన్, శ్రీరాములయ్య పాల్గొన్నారు.

బి.కోడూరులో..

బి.కోడూరు : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని బి.కోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మండల వైద్యాధికారులు డాక్టర్ వినీత్ కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఎంపీడీఓ భాస్కర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్ జాన్‌విలియం, సీహెచ్‌ఓ పుష్పాంజలి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు బషీర్, సిద్దు, ఏఎన్‌ఎం భారతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటల బీమా చేయించుకోండి

మైదుకూరు : తాము సాగు చేసిన పంటలకు రైతులు బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి బాలగంగాధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బండివారిపల్లె, తిమ్మాయపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రెండు గ్రామాల్లో సాగు చేసిన పంటల స్థితిగతుల గురించి రైతులతో చర్చించారు. పంట నమోదు, పంటల బీమా ఆవశ్యకత గురించి వివరించారు.

స్వామి వివేకానంద ఆశయాలు తెలుసుకోవాలి

పోరుమామిళ్ల : మెరుగైన సమాజం రూపుదిద్దుకోవాలంటే యువత ముందుకు రావాలని, విలువలతో, భవిష్యత్ తరాలకు సందేశం ఇచ్చేలా దేశాన్ని తీర్చిదిద్దాలని విశ్రాంత వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ మార్కారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ మార్కారెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల, నైతిక విలువలతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించగలరన్నారు. స్వామి వివేకానందుని ఆశయాలు అందరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో 200 మందికి 'మేలుకో నేస్తమా' పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం రామకృష్ణారెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రామిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



ప్రొద్దుటూరు : ఆర్టీసీ డిపో వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక ఆర్టీసీ డిపో వద్ద మంగళవారం ఏపీపీటీడీ ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంయూఏ నాయకులు మాట్లాడుతూ గవర్నర్‌పేట-2 డిపోకు చెందిన 4.15 ఎకరాల స్థలాన్ని లూలు సంస్థకు బదలాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీఓను ఉపసంహరించుకోవాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ డిపోను తరలించడం ఆపాలని, పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను తక్షణమే చెల్లించాలన్నారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఖాళీగా ఉన్న సుమారు 8వేల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీఓ ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం ద్వారా లేదా సంస్థ ద్వారా కొనుగోలు చేయాలన్నారు. ఆర్టీసీలో ఎక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు అక్కడే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఐఆర్‌ను ప్రకటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ డిపో కార్యదర్శి గోపాల్, చీఫ్ అడ్వైజర్ ఎస్ఎస్ నారాయణ, రీజనల్ ఉపాధ్యక్షుడు భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వేడుకలో మాజీ సైనికులు పాల్గొనాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో డిఫెన్స్ ఎక్స్‌సర్వీస్ మెన్ అసోసియేషన్ ప్రొద్దుటూరు డివిజన్ ఆధ్వర్యంలో ఈనెల 15న ఉదయం 7.30కు స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు డివిజన్ ప్రెసిడెంట్ నేట్ల బాలవీరారెడ్డి తెలిపారు. అలాగే గాంధీ రోడ్డులోని గాంధీ విగ్రహం, టీబీ రోడ్డులోని నేతాజీ సుభాష్‌చంద్రబోస్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో సైనికులు, మాజీ సైనికులు, వీరనారీమణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోలీసులను పావులుగా వాడుకోవడం దుర్మార్గం

ప్రొద్దుటూరు : జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం పోలీసులను పావులుగా వాడుకోవడం దుర్మార్గమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇర్ఫాన్ బాషా తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మంగళవారం జరిగిన జెడ్పీటీసీ ఎన్నికల్లో నాయకులను గృహ నిర్బంధం, అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఓట్లు కూడా వేయనీయకుండా ప్రజలను అడ్డుకుని భయభ్రాంతులకు గురిచేసిన పోలీసులు ఎవరి ఒత్తిడి వల్ల చేస్తున్నారనేది ప్రజలు గమనించాలన్నారు. దేశ స్థాయిలో దొంగ ఓట్లతో గెలుస్తున్నారని, మరోవైపు అధికార దుర్వినియోగం చేస్తూ పోలీసులను వాడుకొని భయానక వాతావరణం సృష్టిస్తున్నారని విమర్శించారు.